అనువాదకథ

# కార్తీక రాత్రి

మలయాళ మూలం : సేతు

తెలుగు సేత : ఎల్.ఆర్.స్వామి

"కిటికి వెయ్యకు" అతడు ఆజ్ఞాపించాడు.

"ఏం..." ప్రశ్నార్థంగా చూసింది ఆమె.

"నేను ఆకాశం చూడాలి; నక్షత్రాలని చూడాలి"

"బయట మంచు కురుస్తోంది. చల్లగాలి వీస్తోంది. చలిగాలి తగులుతే నాకు జ్వరం వస్తుంది. చలికి తట్టుకోలేక చచ్చిపోతాను" ఆమె అంది.

"ఆకాశం కనబడకపోతే నాకు నిద్రపట్టదు" అతని గొంతులేచింది. "సుఖంగా నిద్రపట్టకపోతే పొద్దున మెలుకువరాదు. ఆకాశం చూస్తూ పడుకోవటం, నాకు ముప్ఫైయేళ్లుగా అలవాటు."

"అంతేలే..." ఆమె అలిగింది." నేను ఏమైపోయినా మీకు ఫర్వాలేదు. చలిగాలికి నాకు జ్వరం వస్తేనేంటీ...? నేను చస్తేనేంటీ...? మీకేం బాధ...?" ఆమె కళ్ళల్లో నుంచి కన్నీటి బొట్లు రాలాయి.



అతడు మాట్లాడలేదు. మంచంమీద నక్షత్రాలని చూస్తూ పడుకున్నాడు.

కార్తీక మాసపు ఆకాశం నిర్మలంగా వుంది. కళాపి జల్లిన నేలపై చెదరిన బియ్యపు గింజల్లాంటి నక్షత్రాలు- వాటి మధ్య అస్వస్థతలా, అజ్ఞానంలా చీకటి- చీకటిని చీల్చుకొని వస్తున్నాయి పూర్వజన్మల సందేశాలతో నక్షత్రాలు- ఈ కిటికి వద్ద, మంచంపై పడుకొని వాటి ద్వారా నేను భవిష్యత్తు దర్శిస్తున్నాను.

జనన మరణాలు, పాపాలు వగైరాలు వాసనలుగా ఈ కిటికి నుంచి వస్తున్నాయి. ఆ పరిచిత గంధాలతో నేను మేలుకుంటున్నాను; బ్రతుకుతున్నాను.

జన్మజన్మలతో నన్ను కలిపేది ఆకాశమే; ఈ నక్షత్రాలే. వీటి మధ్య ధూళి నిండిన, అరిగిపోయిన మడమలతో కదిలే బాటసారి మోసే సందేశంలేదు- అందుకునే సందేశమూ లేదు. కాని ఈ ఆకాశం క్రింద నక్షత్రాల నీడలో, పాదాలు స్వయంగా సాగుతున్నాయి.

కళ్ళు తెరిచి నిదురించేవాడి అంతరార్థం వెతుకుతూనా...? లేకపోతే నమ్మకం నశించాక దుఃఖం భరించలేని ప్రయాణమా...?

"ఈ చలిలో పడుకోవటం నావల్లకాదు. చలికి గడ్డ కట్టేస్తాను." దగ్గరకి జరిగి పడుకొని ఆమె అంది. ముడుచుకు పడుకుంది. తుమ్మింది. మళ్ళీమళ్ళీ ముక్కు పిండుకుంది.


అతడు పట్టించుకోలేదు. "గత ముప్ఫైయేళ్ళుగా ఈ కిటికి దగ్గరే, ఈ మంచం మీదే పడుకుంటున్నాను. అతనికి గుర్తువచ్చింది." ఈ కిటికి నుంచే చూస్తున్నాను. బయట రుతువులు మారాయి; మారుతున్నాయి. ఆకాశం వివర్ణమైంది; చీకటి నింపుకుంది. నక్షత్రాలు చనిపోయాయి; కొత్తవి జన్మించాయి. ఉపశమనం కోసం మనిషి కర్మ ఆచరిస్తున్నాడు. కర్మవల్ల జన్మ పరంపర మొదలవుతుంది. మళ్ళీమళ్ళీ పాపం చేస్తున్నాడు మనిషి; పశ్చాత్తాపం చెందుతున్నాడు; బాధపడుతున్నాడు. జన్మపరంపరల్లోనుంచి ప్రయాణిస్తూ వుంటే ధర్మ క్షయం జరగటం తప్పనిసరి. ధర్మ క్షయం సంభవించినప్పుడు అవతారాలూ వుంటాయి. అవతారాలని పూజించే అధోగతిలోకి జారుతారు తరువాత తరం వారు.

ఒకటి కాదు, రెండు కాదు, ముప్ఫై సంవత్సరాలుగా వెనక్కు నడిచినా, అప్పుడే కళ్ళు తెరిచిన కుందేటి పిల్లలా ఇంకా కంగారే! నడిచి నడిచి, కౌమారం దాటి బాల్యం దాటి శైశవ దశ చేరుతున్నాడు. వయస్సు లేని దశకి (సున్న వయస్సు) చేరుతున్నాడు.

అలా అరిగాయి ఈ మడమలు; షర్టులు వొదులైనాయి; ఒళ్ళు పగిలింది. ఉల్లిపాయి పొరలలా సంవత్సరాలు వాటి అంతట అవే రాలి పడినప్పుడు మిగిలేదేంటి?

నువ్వు ఒంటె గురించిన కథ విన్నావా?

ఒకానొకప్పుడు ఎడారిలో నడిచి నడిచి అలసిపోయిన ఒంటె, తెలివి వెలిగిన ఒక నిమిషంలో అ రబిని అడిగింది "ఈ ప్రయాణానికి నువ్వు నన్నే ఎందుకు ఎన్నుకున్నావు? నాకన్నా పెద్ద జంతువులు, నాకన్నా బలవంతులైన జంతువులు, ప్రపంచంలో



**"నీకు ఇంకా వెచ్చదనం అనవసరం." అతడు మనస్సులో అనుకున్నాడు. "వెచ్చదనం అందుకుంటే నీ ప్రయాణం దూరం పెరుగుతుంది. జ్ఞానోదయ నిమిషం వచ్చేసింది నీకు. నీ ప్రయాణం ముగుస్తుంది. నీ కష్టాలు తీరుతాయి. అదిగో, ఆ కనబడే నక్షత్రాల్లో ఏదో ఒక నక్షత్రం నుంచి నీ కోసం సందేశం బయలుదేరిపోయింది.**

చాలా వున్నాయి కదా? అయినా, నా వీపు మీదే ఎందుకీ బరువు?"

ఆమాట విని ఆ రబి నవ్వాడు "అందరికన్నా బుద్ధిహీనుడు నువ్వే. అందువల్లే బరువు మోయడానికి నిన్ను ఎన్నుకున్నాను. ఇసుక తిన్నెల్లో కాళ్ళు ఈడుస్తూ ఈడుస్తూ నువ్వు నడుస్తావు; ఏ సొణుగుడు వుండదు. నాటి జ్ఞాపకాలు నెమరువేసుకుంటూ నడుస్తావు. నన్ను ఎదిరించవు. నిరసన చూపవు. మాట వింటావు. అది నీ గుణం, అదే నీ ఖర్మ కూడా."

బయట ప్రశాంతమైన కార్తీక రాత్రి- మంచు దుప్పటి కప్పుకున్న చీకటి మోము కొంత వివర్ణమైంది. కొండ ఎక్కేవారి అడుగుల సవ్వడి వినబడ్డాయి.

"ఇదిగో మంచు, చీకటిని లొంగ తీసుకుంటోంది." అతడు అస్వస్థతతో గొణిగాడు. అనిర్వార్యమైన కలయిక అది. విడతీయలేని విధంగా కలిసిపోయాక రెండు ఒకటే. మంచు, చీకటి, కార్తీక రాత్రి, కిటికీలోంచి చూసే మనిషి, కొండ ఎక్కి వెళ్ళే ప్రయాణీకులు అంతా- అందరూ ఒకటే."

"బాబోయి... ఈ చలి నేను భరించలేను. నేను చస్తున్నాను. కిటికీ వేసేయండి. కొంత వెచ్చదనం ఇవ్వండి." ఆమె వెక్కివెక్కి ఏడ్చింది. ఆ ఏడుపు గదిలో మారుమ్రోగింది. అయినా ఏమి అనలేదు, అతడు.

"నీకు ఇంకా వెచ్చదనం అనవసరం." అతడు మనస్సులో అనుకున్నాడు. "వెచ్చదనం అందుకుంటే నీ ప్రయాణం దూరం పెరుగుతుంది. జ్ఞానోదయ నిమిషం వచ్చేసింది నీకు. నీ ప్రయాణం ముగుస్తుంది. నీ కష్టాలు తీరుతాయి. అదిగో, ఆ కనబడే నక్షత్రాల్లో ఏదో ఒక నక్షత్రం నుంచి నీ కోసం సందేశం బయలుదేరిపోయింది.

ఒక లిల్లిపువ్వుగా...
ఒక తెల్ల పామురముగా...
ఒక కుందేటి పిల్లలాగా....

పుట్టడం... మళ్ళీమళ్ళీ పుట్టడం... నీకై ఏడు జన్మలు కేటాయించి వున్నాయి. ఆ జన్మల మధ్య ఏది కోరుకోకూడదు. కోరికల వల్ల ప్రయాణపు సంకెళ్ళ పొడుగు పెరుగుతుంది. జన్మలు పెరుగుతాయి. ఏది ఆశించక; ఏది కోరుకోక"

"ఆ కిటికి వేసేయండి. దేవుడు సాక్షిగా చెబుతున్నా... నేను చస్తున్నాను"

ఆమె గొంతు తడబడింది. మాటలు ఎక్కడనుంచో వచ్చినట్లు ఉండేవి. ఆ మాటలు అతని చెవుల్లో పడి చెదిరి బిందువులుగా మారి ఆవిరైనాయి. ఆమె మాటల్లో వినబడేది ఆమెకి బ్రతుకుపట్ల వుండే ఆశ మరియు అజ్ఞానం కదా అని అనుకొని బాధపడ్డాడు అతడు.

"నా సలహాలు, ఉపన్యాసాలు ఎక్కడ పడి ఎండినాయి? జన్మల మూటలు ఎక్కించే దేవుని పేరేగా ఇంకాఇంకా స్మరిస్తోంది ఆమె? జ్ఞానోదయమయ్యే ఈ నిమిషంలో కూడా ఆమెని వెనక్కు లాగేదేంటీ?

బాధపడకు బిడ్డా, బాధపడకు ఏడు జన్మలు వెలగవలసిన నీ కుంభీలో ఒకటి వెలిగి ఆరిపోతోంది. పోయింది పోనీ; సంతోషించు. మళ్ళీ మరొకటి నింపు. తొందరగా కానీ... ఏడూ వెలిగి ఆరుతే నీ కర్మ పరంపర ముగుస్తుంది కదా...? నీ ప్రయాణం మరియు నీ దుఃఖం గట్టెక్కుతాయి కదా...?"

మంచులో తడిసిన కార్తీక రాత్రి కిటికిలో నుంచి లోనికి ప్రవేశించింది; మరణంగా, ఓదార్పుగా, జ్ఞానోదయంగా, వెలుగుగా, ఆమెని కప్పింది అది. కాని ఆమె ఏడుస్తూనే వుంది, ఆ గూడు వదిలిపోతున్నందుకు. ఆ గూడూ గూటి ఊచలు దాని చిరువెచ్చదనం, తనకి చాలా ప్రియమైనవని అప్పుడు తెలుసుకుంటోంది. తన కలలు, బాధలు ఆమెకి ప్రియాతిప్రియం. వాటిని వదలి వెళ్ళటం బాధాకరం.

"నాకు వెళ్ళాలని లేదు. నేను వెళ్ళలేను" ఆమె అంది.

"కాని బిడ్డా..." అతడు సలహా ఇచ్చాడు. "ఈ జ్ఞానోదయపు వేళలో నీ క్షుద్రచింత వదులు. స్వస్థత చేకూర్చుకో..."

"ఈ జ్ఞానోదయం నాకు వద్దు. అది నావైన ఏవేవో పోగొడుతోంది. ఏను నడిచిన నేల, నా తోటలో విరిసిన పూలు, నేను పెంచిన పంట... అవి ఆ జ్ఞానం" అతడు మాట్లాడలేదు.

"పిచ్చిదానా" ఒక చిరునవ్వుతో అతడు అనుకున్నాడు. "శాశ్వతపు వధువు కావలసిన ఈ నిమిషంలో ఈమెకి, దుఃఖమెందుకు? సంతోషించు; స్వయం సాంత్వన పరుచుకో..."

ఆ రాత్రి కదలిక లేని ఒక నిమిషంలో, గ్రహాంతరాల నుంచి వచ్చింది, సందేశం.

ఆమె అది చదివింది.

"ఈ నిమిషం నీ ప్రయాణానికి తుది నిమిషం కానీ..." అది తెలుసుకుంది, ఆమె; అందుకుంది.

కాని ఆ జ్ఞానోదయ సమయంలో ఒక పాప చింత అతన్ని వేధిస్తూనే వుండేది.

"ఆ కిటికి వేసి వుంటే ఆమె బ్రతికిపోయేది. కాని ఆకాశాన్ని, నక్షత్రాలని వీక్షించలేక ఉక్కిరిబిక్కిరైన నువ్వు చనిపోయేవాడివి... నీ ఈ పాపం నువ్వు ఎలా సమర్థిస్తావు?" మనస్సు అడిగింది.

కాసేపు ఆలోచించాక జవాబు చెప్పాడు అతడు-

"అది ప్రయాణికుని చిన్న స్వార్థం అంతే..."

తిరిగి పడుకొని నిద్రపోయాడు అతడు.

- 1971